ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.4
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శుక్రవారం 6 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	587.70 (305.9222)	95,761	40,810
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.30 (3.52)	8,773	12,111
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.78 (43.88)	57,482	57,482

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.200

కన్నీళ్లే మిగిలాయి



భారీ వర్షాలు పేదలకు కన్నీళ్లను మిగిల్చాయి. నాలుగు రోజుల కిందట వర్షాలు పేదల ఇళ్లను నేలమట్టం చేశాయి. కాయకష్టం చేసి పెంచుతున్న పంటల్లో ఇసుక మేటేసింది. ఎటుచూసినా కష్టం, నష్టం తప్ప మిగిలించిందేమీ లేదన్నట్లుగా జీవితం ఆగమ్యగోచరంగా మారింది. కోదాడ మండలం తొగర్రాయి, కూచిపూడితో పాటు ఆత్మకూర్(ఎస్) మండలం మండలాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. వర్షం తెరపినిచ్చినా జీవితాలు ఇప్పట్లో తెరపినిచ్చేలా లేవు.

● తేరుకోని తొగర్రాయి, కూచిపూడి ● ఆత్మకూర్(ఎస్) మండలంలో భారీగా పంట నష్టం



కోదాడ రూరల్, సెప్టెంబరు 5 : కోదాడ మండలంలో తొగర్రాయి, కూచిపూడి గ్రామాలు వరద బాధల నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాయి. పూర్తిగా నీట మునగడంతో పాటు ఇళ్లు కూలి, పంటలు కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయారు. గ్రామంలో సుమారు 15కి పైగా ఇళ్లు కూలిపోగా, మరో 15 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వరదలతో నాలుగు గేదెలు, 20 గొర్రెలు వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందాయి. వరద తాకిడికి ఇంట్లో వస్తువులు చెల్లాచెదురై కట్టుబట్టలే మిగిలాయి. ఇంకా కొన్ని కాలనీలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. వెరసి చీకట్లోనే మగ్గాల్సిన దుస్థితి నెలకొంది.

గేదెలు చనిపోయాయి



తీవ్ర జ్వరంతో కోదాడ ఆసుపత్రిలో ఉండగా వచ్చిన వర్షాలతో ఇల్లు పూర్తిగా నీటమునిగింది. ఇంట్లో ఉన్న వస్తువులు, ధాన్యం, బట్టలు అన్నీ కొట్టుకుపోయాయి. ఇంటి ముందు కట్టేసిన గేదె కూడా చనిపోయింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి, ఆదుకోవాలి.

\- కాసాని రమాదేవి, తొగర్రాయి

అధికారులు ఎవరూ రాలేదు



వరదల్లో ఇల్లు కూలిపోవడంతో పాటు వస్తువులు కూడా కొట్టుకుపోయాయి. టీవీ, ఫ్రిడ్జ్ కూడా నీటిలో కొట్టుకుపోయాయి. ఇంతవరకు సర్వే అధికారులు తమ ఇంటికి రాలేదు. తగిన నష్టపరిహారం ఇప్పించాలి. సమస్యలను త్వరగా పరిష్కరించాలి.

\- బాలెబోయిన వెంకటేష్, తొగర్రాయి

నష్టం అంచనా సర్వే ఏదీ?

మండలంలోని కూచిపూడి, తొగర్రాయి గ్రామాల్లో వరదలతో పెద్దఎత్తున పంటలు కొట్టుకుపోయాయి. దీనికితోడు పెద్దఎత్తున పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో తిరిగి సాగు చేసే వీలు లేకుండాపోయింది. వరద సంభవించి నాలుగురోజులు గడుస్తున్నా అధికారులు ఇంతవరకు సర్వే నిర్వహించలేదు. తాము పంటల కోసం తెచ్చుకున్న యూరియా కట్టలు, దుక్కి మందు కట్టలు పూర్తిగా నీటమునిగి తీవ్రంగా నష్టపోయారు. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తారని కలెక్టర్ హామీ ఇచ్చారని, అయినా నష్టాన్ని అంచనా వేసేందుకు ఎవరూ రాలేదని బాధితులు తెలిపారు.

సాయంలో లోపించిన చురుకుదనం

వరద బాధితులకు సాయం అందించడంలో, నష్టనివారణ చర్యల్లో నెమ్మదితనం కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాధితులకు పరిహారం ప్రకటించినా నేటికీ అందలేదు. చేతిలో చిల్లిగవ్వలేక బాధితులకు ఎటూ పాలుపోని పరిస్థితి. కలెక్టర్ ఆదేశించినా ఇంతవరకు అధికారులు ఎవరూ వివరాలు తీసుకోలేదని తొగర్రాయి గ్రామస్థులు తెలిపారు. అదే విధంగా తొగర్రాయి ఊరు ముందు తాత్కాలిక బ్రిడ్జి పనులు ప్రారంభించారు తప్ప పనులు చురుగ్గా సాగడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. గ్రామం నుంచి తాము బయటికి వెళ్లాలంటే ఉన్న రోడ్డు కొట్టుకుపోవడంతో మోకాలు లోతు బురదలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ సింగిల్ ఫేజ్ విద్యుత్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించినా అధికారులు మాత్రం పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

పారిశుధ్య నివారణ చర్యలు ముమ్మరం

తొగర్రాయి, కూచిపూడి గ్రామాల్లో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టామని ఎంపీడీవో రాంచందర్‌రావు, ఎంపీవో రంగయ్య తెలిపారు. ఇప్పటికే గ్రామంలో దోమల నివారణ మందులు స్ప్రే చేయించామని, మురుగు నీటి కాల్వలను శుభ్రం చేయించి నీరు బయటికి వెళ్లేలా చర్యలు చేపట్టామన్నారు. 20 మంది పారిశుధ్య కార్మికులతో గ్రామంలో డ్రైనేజీలు శుభ్రపర్చి ఊర్లల్లో తాగునీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించామన్నారు. నాలుగురోజులుగా పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. తొగర్రాయి గ్రామంలో ప్రజలకు అంటువ్యాధులు వ్యాపించకుండా ముందుజాగ్రత్తగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు.

పొలం నిండా ఇసుక, నీరు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో భారీ వర్షాలకు పూర్తిస్థాయిలో పంటలు దెబ్బతిన్నాయి. కాల్వలు, చెరువుల వెంట ఉన్న భూముల్లోకి వరద పోటెత్తింది. దీంతో మోకాళ్లోతు ఇసుక మేటలు వేయడంతో ఈ సీజన్‌లో సాగుకు నోచుకోని పరిస్థితి. ఇసుకను ఎత్తిపోయడానికి కూడా నెల రోజుల పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోవిందాపురం, కరక్కాయలగూడెంలో రైతులు పంటలు తీవ్రంగా నష్టపోయారు.

మేట మిగిలింది.. పంట పోయింది



వారంరోజుల పాటు జిల్లాలో కురిసిన భారీ వర్షాల నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఆరుగాలం కష్టపడి రైతులు సాగుచేసిన పంటలు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పత్తి, మిర్చి, వరి పొలాల్లో ఇసుక మేట వేయడంతో పంటలు నామరూపాలు లేకుండా పోయాయి. దీంతో రైతులు ఏమీ పాలుపోని స్థితిలో ఉన్నారు. ఆత్మకూర్(ఎస్) మండలంలోని పాతర్లపహాడ్ గ్రామంలో అరేంపుల రాజుకు చెందిన రెండు ఎకరాల మిరప తోట అయ్యావారి కుంట అలుగు పోయడంతో కొట్టుకుపోయింది. ఇసుక మేట తప్ప అక్కడ ఏమీ మిగలలేదు. మిడ్తనపల్లి గ్రామంలో రైతులు సామనారాయణరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు, బిక్షం, లక్ష్మారెడ్డి, రామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలకు చెందిన పొలాలు ఏటి వెంట వరద తాకిడికి సుమారు పది ఎకరాలు, మక్తా కొత్తగూడెం గ్రామంలో ఏటి వెంట ఉన్న బద్దం లింగమల్లారెడ్డి, బద్దం దర్మారెడ్డి, గుండాల గురువయ్య, సామావెంకట్‌రెడ్డి వరి పొలాలు వరద తాకిడికి పూర్తిగా కొట్టుకుపోయాయి. అదేవిధంగా ఏపూర్, బొప్పారం, తుమ్మలపెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), కోటాపహాడ్, నెమ్మికల్ గ్రామాల్లో చెరువులు నిండి వచ్చిన వరద ప్రవాహంలో పంట పొలాలు మునిగిపోయాయి. అధికారులు దెబ్బతిన్న పొలాలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

మక్తా కొత్తగూడెం ఏటివాగు వరద తాకిడికి ఇసుక మేటతో నిండిన వరి పొలం

‘హైడ్రా’పై మీ అభిప్రాయం?

● హుజూర్‌నగర్‌లో అమలుకు ఉత్తమ్ ఆలోచన
● స్థానిక నాయకులతో సంప్రదింపులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 5: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో హైడ్రా తరహాలో అమలు కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయం కోరగా నేతలు సైతం హైడ్రాను అమలుచేయాలని సూచించినట్లు తెలిసింది. ఇటీవల వరద బాధితులను పరామర్శించిన రోజు నాయకులను హైడ్రాపై అభిప్రాయం కోరినట్లు చెబుతున్నారు. విఘ్నేశ్వరకాలనీ, శివాలయం వీధి, గోవిందాపురం రోడ్డు, పరవతి సంఘం సెంటర్, మట్టపల్లి బైపాస్‌రోడ్డు, శ్రీవేంకటేశ్వరస్వామి బైపాస్‌రోడ్డు ప్రాంతాల్లో వరదలతో జరిగిన నష్టాన్ని పరిశీలించి ఆక్రమణాలు తొలగించాలని ఆర్డీవో, కమిషనర్లను ఆదేశించారు. ప్రధానంగా మినీట్యాంక్ డిజైన్ మార్పుతో శివాలయం వీధి నుంచి పెద్దఎత్తున చెరువు నీరు పట్టణంలోకి రావడం గంగమ్మ దేవాలయం ప్రాంతం, శివాలయం పక్క ఇళ్లు మునిగిపోవడం మంత్రిని కలిచివేసింది. ఈ నేపథ్యంలోనే హైడ్రా వంటి వ్యవస్థను అమలుచేయాలన్న ఆలోచన మరింతగా పెరిగిందంటున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంతో పాటు కోదాడ నియోజకవర్గంలోని పెద్దచెరువు ఆక్రమణలపై ఉత్తమ్ దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కోట్లాది రూపాయల విలువచేసే శిఖం భూములు ఆక్రమించి రెండు నియోజకవర్గాల్లో పక్కా భవనాలు నిర్మించారు. అదేవిధంగా వందల కోట్ల విలువచేసే చెరువు భూములు కబ్జాచేసి భూస్వాములు సాగుచేస్తున్నారు. హుజూర్‌నగర్‌లోని విఘ్నేశ్వరకాలనీలో ఉండే దద్దనాల చెరువు ఇప్పుడు ఆనవాళ్లు లేకుండాపోయింది. 50 ఎకరాల చెరువు విస్తీర్ణంలో 15 ఏళ్లుగా 500 మంది ఇళ్లు నిర్మించారు. ప్రస్తుతం దద్దనాల చెరువు 100గజాలు కూడా లేదు. ఈ ఆక్రమణలతోనే వర్షం వస్తే చాలు విఘ్నేశ్వరకాలనీలోని 200 ఇళ్లు మునకకు గురవుతున్నాయి.

110 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సిన ముత్యాలమ్మచెరువు 60 ఎకరాల వరకు కబ్జాకు గురైంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఒక ఊరే వెలిసింది. కళాశాలలు, అపార్ట్‌మెంట్లు, వెంచర్లు వెలిశాయి. ఒకనాడు ఎంబీ కెనాల్ నుంచి ఊరచెరువుకు నీరు వచ్చేందుకు 50 అడుగుల వెడల్పులో ఫీడర్ ఛానెల్ ఉండేది. ఇప్పుడు అది పిల్ల కాల్వలా మారింది. గతంలో శివాలయం చెరువుకట్టకు ఆనుకుని ఉండేది. శివాలయం ప్రాంతంలో కట్ట మీద అనేక ఇళ్లు నిర్మించారు. ముత్యాలమ్మ దేవాలయం ప్రాంతంలోని 6, 7 వార్డుల్లోని ఇళ్లు మొత్తం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో ఉన్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా అమలు చేస్తే వచ్చే ఫలితాలు, విమర్శలపై సమగ్రంగా విశ్లేషణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

హుజూర్‌నగర్‌లోనూ హైడ్రా అమలుచేయాలి



హుజూర్‌నగర్ ప్రాంతంలోని పేదలకు ఇళ్లు మంజూరు చేసి హైడ్రా అమలు చేయాలి. హైడ్రా అమలు చేస్తే భారీ వరదలు వచ్చినా ఇబ్బందులు తలెత్తవు. వర్షాలతో అనేక ప్రాంతాల్లోని ఇళ్లు నీటిలో చిక్కుకుంటున్నాయి. పేదలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు.

పశ్య పద్మ, సీపీఐ రాష్ట్ర నాయకురాలు

వర్షాలకు 22 వేల ఎకరాల్లో పంట నష్టం

● 18 వేల ఎకరాల్లో వరి, 3 వేల ఎకరాల్లో పత్తి: జిల్లా వ్యవసాయాధికారి


సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ శ్రీధర్‌రెడ్డి

తుంగతుర్తి, సెప్టెంబరు 5 : వర్షాలు, వరదలకు జిల్లాలో 22,194 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గురువారం మండలకేంద్రంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి, మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే తమశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం 18,696 ఎకరాల్లో వరి, 3,000 ఎకరాల్లో పత్తి, 38 ఎకరాల్లో కంది, 460 ఎకరాల్లో మిర్చి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. 11,950 ఎకరాల్లో వరదలతో ఇసుక మేట వేసిందన్నారు. పంట నష్టం గురించి సేకరించిన వివరాలను ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామన్నారు. జిల్లాలో చాలా మండలాల్లో రుణమాఫీ కాలేదని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రుణమాఫీ కాని రైతుల ఆధార్ నెంబర్‌తో పాటు కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం ఫొటోమ్యాపింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రక్రియను ఈ నెల 12వ తేదీలోపు పూర్తిచేస్తామన్నారు. ఇప్పటి వరకు మూడు దశల్లో 1,00,545 మంది రైతులకు మొత్తం రూ.838.69 కోట్ల మేర రుణమాఫీ జరిగిందన్నారు. జిల్లాలో రెండున్నర లక్షలకు పైగా రైతులు ఉన్నారని తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆసుపత్రులకు అనుమతులు లేకుంటే చర్యలు


గరిడేపల్లి పీహెచ్‌సీలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 5 : జిల్లాలో ఎవరైనా అనుమతులు, అర్హత లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో కోటాచలం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీసత్యనారాయణ క్లినిక్ తనిఖీ అనంతరం సీజ్ చేసి, మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జీ చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారి అనితరాణి, గణాంక అధికారి పీ వీరయ్య, మనోహరరాణి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

గరిడేపల్లి/ నేరేడుచర్ల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి కోటా చలం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ హెల్త్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. ఓపీ వివరాలు, మందుల నిల్వ, పంపిణీ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి జ్వరసర్వే పక్కాగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో తీగల నరసింహ, స్టాఫ్ నర్స్ యశోద, ఫార్మసిస్ట్ కృష్ణ, ఏఎన్ఎం కవిత, సూపర్ వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.నేరేడుచర్ల పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో పరిశీలించారు. అనంతరం ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లు అన్ని ప్రాంతాల్లో నీరునిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిభావంతో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, పక్కన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 5:జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ భక్తిభావంతో గణేష్ నవరాత్రోత్సవాలను నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ ఉత్సవాల్లో ప్లాస్టిక్‌ను వినియోగించవద్దన్నారు. బంకమట్టితో తయారు చేసిన విగ్రహాలను నెలకొల్పేందుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, సోదరభావంతో మెలగాలన్నారు. అధికారులు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రోత్సవాలు నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు.

ఘర్షణలకు తావులేకుండా ఉండాలి

ఘర్షణలకు తావులేకుండా గణేష్ ఉత్సవాలను నిర్వహించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. జిల్లాలో ఎప్పుడైనా ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయని అదేవిధానాన్ని కొనసాగించాలన్నారు. గణేష్ ఉత్సవాల కారణంగా గట్టిబందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు 24 గంటల పాటు ఉండాలని ఆదేశించారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా మండపాలను ఏర్పాటు చేయాలన్నారు.విద్యాసంస్థలు, ప్రార్థనామందిరాలు, ఆస్పత్రులు, వృద్ధాశ్రమాలకు సమీపంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయవద్దన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, జీ రవి, ఆర్డీవో వేణుమాధవ్, శాంతి కమిటీ సభ్యులు రుక్మారావు, చకిలం రాజేశ్వర్‌రావు, ఫక్రుద్దిన్, హాఫీజ్‌ఖలీల్, అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, గండూరి రమేష్, రియాజుద్దిన్, జలీల్, జానీతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా కార్మిక శాఖ

సూర్యాపేట(కలెక్టరేట్): కార్మికుల కుటుంబాలకు అండగా కార్మికశాఖ ఉంటుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కోదాడకు చెందిన లారీ డ్రైవర్ అంజయ్య కుటుంబసభ్యులకు కలెక్టరేట్‌లో కార్మికశాఖ కార్యాలయంలో కార్మికశాఖ ద్వారా మంజూరైన రూ.6.10లక్షలను బీమాచెక్కును అందజేసి, మాట్లాడారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా రుణమాఫీపై కలెక్టరేట్‌లో ఏర్పాటు కంట్రోల్‌రూంను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ జగదీష్‌కుమార్, సిబ్బంది తండ సందీప్, విజయలక్ష్మి, శ్రీనివాస్, అర్షద్, షరీఫ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో ఆరు లక్షల ఎకరాల్లో పంట నష్టం


ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పశ్య పద్మ

హుజూర్‌నగర్, సెప్టెంబరు 5 : రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో ఆరు లక్షల ఎకరాల మేరకు రైతులు నష్టపోయారని రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పశ్య పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో వరదలతో నష్టపోయిన బాధితులను గురువారం ఆమె పరామర్శించి, ఆర్డీవో శ్రీనివాసులుకు రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదలతో నష్టపోయిన పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, చెరువులు, కుంటలను ఆక్రమించి ఇళ్లు కట్టుకున్న పేదలందరికీ ఫణిగిరిగట్టు వద్ద మోడల్ కాలనీలో ఇల్లు కేటాయించాలన్నారు. ఆ తర్వాతనే హైడ్రాను అమలుచేయాలన్నారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో చెరువులు, కుంటలు తెగడంతో రైతులు పెద్దఎత్తున నష్టపోయారన్నారు. పాక్షికంగా దెబ్బతిన్న రైతులకు రూ.15వేలు, ఇసుక మేటలు వేసి పొలం మొత్తం కొట్టుకుపోయిన రైతులకు రూ.50వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రమంతటా హైడ్రాను అమలు చేయాలన్నారు. హైడ్రాతో నష్టపోయే పేదలకు న్యాయం చేయాలన్నారు. నిష్పక్షపాతంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పోజు సూర్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుండు వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్, మామిడి నర్సయ్య, జక్కుల రమణ, వెంకట్రామయ్య, వెంకటేశ్వర్లు, అంజయ్య, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

సేల్స్ రంగంలో రాణించాలనుకునే యువతి, యువకులకు మంచి అవకాశం
మీరు చేయవలసినదల్లా ఆంధ్రజ్యోతి దినపత్రికకు చందాదారులను చేర్పించటమే
ఆసక్తి, ఉత్సాహముగల అభ్యర్థులకు సేల్స్ రంగంలో... మెళుకువలు నేర్పించి తగిన శిక్షణ ఇవ్వబడును.
- బుక్ చేసిన కాపీ ఒక్కింటికి రూ. 200/- చొప్పున కమీషన్ ఇవ్వబడును.
- ప్రతి ఒక్కరు నెలకు సుమారు రూ. 20,000/- పైన ఆదాయం పొందే అవకాశం కలదు.
-: అర్హతలు :-
- 19 సం॥రాల నుండి 30 సం॥రాల మధ్య ఉండాలి
- తెలుగు అనర్గళంగా మాట్లాడగలగాలి.
- పదవ తరగతి పాస్/ ఫెయిల్, ఆపైన
-: పనిచేయవలసిన ప్రాంతం :-
నల్లగొండ జిల్లా : 9985411407
సూర్యాపేట జిల్లా : 9985411408
యాదాద్రి జిల్లా : 7660936837, 8688028818
మిర్యాలగూడ జోన్ : 9963624250, 9542690885
ఇంటర్వ్యూ తేది : 06-09-2024
సమయం : ఉ॥ 10.00 గం॥ల నుండి 2.00ల వరకు
-: సంప్రదించవల్సిన చిరునామా :-
ఆంధ్రజ్యోతి కార్యాలయం
ఆర్జాలబావి, సర్వే నెం. 1617, అద్దంకి బైపాస్,
నల్లగొండ సెల్: 9958411394

ముగిసిన మదర్ డెయిరీ నామినేషన్ల పరిశీలన

హయత్‌నగర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీలోని ఆరు డైరెక్టర్ పదవులకు జరుగుతున్న ఎన్నికలకు బుధవారం 21మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 15మంది నామినేషన్లు వేయగా, రంగారెడ్డి జిల్లా నుంచి ఆరు మంది నామినేషన్లు వేశారు. గురువారం మదర్ డెయిరీ కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ల పరిశీలన జరిగింది. ఈ సందర్భంగా 21 నామినేషన్లు సవ్యం ఉన్నట్లు ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13న ఎన్నికలు జరగనున్నాయి.



ఎమ్మెల్యే చిర్ల బలయ్యతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

పార్టీ అభివృద్ధికి రాములు సేవలు శ్లాఘనీయం

విగ్రహావిష్కరణ సభలో త్రిపుర రాష్ట్ర గవర్నర్

రామగిరి, సెప్టెంబరు 5: పార్టీ అభివృద్ధికి పాటుపడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన బీజేపీ సీనియర్ నేత ఓరుగంటి రాములు సేవలు శ్లాఘనీయమని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం రాత్రి నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఓరుగంటి రాములు సంస్మరణ సభ, విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ రాములు జీవితాంతం పార్టీ అభివృద్ధికి, దేశ రక్షణ, హిందూ ధర్మం కోసం పనిచేశారన్నారు. జనసంఘ్ కార్యకర్తగా అంచెలంచెలుగా బీజేపీ రాష్ట్ర నాయకుడిగా ఎదిగాడన్నారు. 1981లో నల్లగొండ బీజేపీ అభ్యర్థి మునిసిపల్ చైర్మన్‌గా గెలుపొందటంలో రాములు క్రియాశీలక పాత్ర పోషించాడన్నారు. తాను నల్లగొండ ఎంపీగా పోటీ చేసినప్పుడు రాములు చేసిన సహాయ సహకారాలు మరవలేనివన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పరిష్కరించేవారని గుర్తుచేసుకున్నారు. రాములుతో తనకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. జనసంఘ్ కార్యకర్త నుంచి అంచెలంచెలుగా బీజేపీ రాష్ట్ర నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. నల్లగొండలో దేవాలయ సమస్యను పరిష్కరించినట్లు ఆయన గుర్తుచేశారు. 1981లో నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బీజేపీ సొంతం చేసుకోవడంలో రాములు క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. రాములు ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసి సఫలీకృతం కాకపోయినా, పార్టీ గ్రామ గ్రామాన విస్తరించాలన్న లక్ష్యంతో పని చేశారని అన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా నీరసపడకుండా పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పని చేసినట్లు తెలిపారు. తాను నల్లగొండ ఎంపీగా పోటీగా చేసినప్పుడు రాములు చేసిన సహాయ సహకారాలు మరవలేనివన్నారు. అలాంటి వ్యక్తి ప్రమాదంలో మరణించడం జీర్ణించుకోలేకపోతున్నానని పేర్కొన్నారు. ఇదే క్రమంలో తన పాత మిత్రులను గుర్తు చేసుకున్నారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ఓరుగంటి రాములు పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా, పోలీసు కేసులు వచ్చినా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమస్యను పరిష్కరించేవారన్నారు. ఈ సమావేశంలో ఓరుగంటి రాములు సతీమణి ధనలక్ష్మి, కుమారులు శ్రీనివాస్, వంశీ, మాధవప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నర్సింహారెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, మల్లేష్‌యాదవ్, గార్లపాటి వెంకటయ్య, నన్నూరి రాంరెడ్డి, కర్నాటి విజయ్‌కుమార్, కల్లెం బాల్‌రెడ్డి, పోతేపాక సాంబయ్య, పెరిక మునికుమార్, ఎర్రమల్ల భాస్కర్, కూతురు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో ఓరుగంటి రాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

బంతి పూల సాగు... భలే బాగు



కట్టంగూరు, సెప్టెంబరు 5: బంతిపూల సాగులో లాభాలు ఉండడంతో రైతులు అటు వైపు దృష్టి సారిస్తున్నారు. బంతి పూల సాగులో ఎంత పెట్టుబడి పెడతామో అదే స్థాయిలో లాభాలు వస్తుండడంతో నల్లగొండ జిల్లా కట్టంగూరు గ్రామ పరిధిలోని రామ్‌నగర్‌కు చెందిన యువ రైతు ఎరుకల వేణు తనకున్న 10గుంటల వ్యవసాయ భూమిలో నాలుగు సంవత్సరాల నుంచి బంతిపూలను సాగు చేస్తున్నారు. భూమి సాగు, ఎరువులు, మొక్కలు, భూమి దున్నడం లాంటి వాటి కోసం సుమారు రూ.25వేలు ఖర్చు వస్తుందని వేణు తెలిపారు. రెండు నెలల పాటు(జూన్,జూలై) బంతి చెట్లను పెంచితే, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో బంతిపూలు చేతికొస్తాయి. పండుగల సీజన్లో కేజీ రూ.150, సీజన్ లేనపుడు కేజీ రూ.100కు విక్రయిస్తున్నారు. వాతావరణం అనుకూలించి పూల సాగుకు అనుకూలంగా వర్షాలు పడితే 10గంటల సాగుకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు లాభాలు అందించవచ్చు వేణు తెలిపారు.

బంతిపూల సాగుతో లాభాలు

బంతిపూల సాగుతో లాభాలు పొందుతున్నాం. 10గుంటల భూమిలో బంతిపూల సాగు చేస్తే సుమారు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు లాభాలు వస్తున్నాయి. నాలుగు సంవత్సరాల నుంచి బంతిపూలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నాం. సీజన్‌లో బంతిపూలను కేజీ రూ.150, సీజన్ లేనప్పుడు కేజీ రూ.100కు విక్రయిస్తాం.

● ఎరుకల వేణు, యువరైతు రాంనగర్, కట్టంగూర్.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 5: గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చెత్తను ఎప్పటికప్పుడు తిలగించేలా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తిలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలోని మొక్కలు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. తాగునీటి ట్యాంకును ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తుండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో స్వచ్ఛదనం కార్యక్రమం పగడ్బందీగా చేపట్టాలని చెత్తాచెదదారంను తొలగించాలని సూచించారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. చెత్తా చెదారం, నీటినిల్వలు లేకుండా సీజనల్ వ్యాధులకు కారణమవుతాయని పరిశుభ్రతను పాటించి సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశుభ్రత అనారోగ్య సమస్యలను పారదోలవచ్చన్నారు. ఆయన వెంట చిట్యాల ఎంపీడీవో ఎస్‌పి. జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగుతున్నాయి. అండర్-11 బాలబాలికల పోటీలకు తెలంగాణ నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు నేషనల్స్‌లో స్థానం కోసం తలపతున్నారు. పోటీలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ తోట రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రశాంత్ పర్యవేక్షిస్తున్నారు.

ఆపదలో ఉన్నవారు హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్‌చేయాలి


భువనగిరి టౌన్, సెప్టెంబరు 5: మహిళలు, పిల్లలు ఆపత్కాలంలో హెల్ప్ లైన్ నెంబర్లు 181, 1098కు ఫోన్ చేసి రక్షణ పొందాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్సిల్ లిటరసీ మనిషా అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని తాతానగర్, ఎరుకల బస్తీ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన వంద రోజుల సంకల్ప్ కార్యకలాపాల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సుకన్య సమృద్ధి యోజన, గృహ హింస తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని కోడిగుడ్లు తదితర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు, బాలమణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 5: అగ్ని ప్రమాదంలో వృద్ధురాలి గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని నేతాపురం గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన 80 సంవత్సరాల వృద్ధురాలైన కోరె లింగమ్మ కొన్నేళ్లుగా చిన్న గుడిసెలో నివాసం ఉంటుంది. గురువారం సాయంత్రం గ్రామంలో ఉన్న తన కుమార్తె బుచ్చమ్మ ఇంటి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పు అంటుకోవడంతో తగలబడుతుండగా స్థానికులు చూసి వెంటనే మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో లింగమ్మకు చెందిన వంట సామాను, ఇంట్లోని దుస్తులు, ఇతర సామాగ్రి దగ్ధమైనట్లు తెలిపారు. వృద్ధురాలు లేని సమయంలో గుడిసె కాలిపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.











బాబోయ్ దొంగలు

● తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఆగంతకులు



చింతపల్లి, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్ (మాల్)లో దొంగల బెడద తీవ్రమైంది. మండలం గొడకొండ్ల గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)లోని తాళం వేసిన ఇళ్లలోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరపడి చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో ఏ ఇంట్లో, వ్యాపార దుకాణంలో చోరీ జరుగుతుందోనని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చింతపల్లి మండల కేంద్రానికి 25కిలోమీటర్ల దూరంగా ఉండటం వల్ల రాత్రి సమయంలో పోలీసులకు ప్రజలకు నిఘా ఏర్పాటు చేయాలంటే కొద్దిగా ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉంటే రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న వెంకటేశ్వరనగర్ ఉండటంవల్ల చోరీ చేసిన ఆగంతకులు రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్‌కు కలిసిపోవడంతో చర్చనీయాంశంగా మారింది.

వీటీనగర్‌లో కనిపించని సీసీ కెమెరాలు

రెండు జిల్లాల కూడలి ప్రధాన వ్యాపార కేంద్ర బిందువుగా అభివృద్ధి చెందుతున్న వెంకటేశ్వరనగర్(మాల్)లో గతంలో ఎస్పీ దుగ్గల్ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరిగిన వెంటనే సీసీ కెమెరాల సహాయంతో సమాచారం తెలుసుకునేవారు. ఇటీవల సాగర్ -హైదరాబాద్ ప్రధాన రహదారి వేంకటేశ్వరనగర్‌లో రోడ్డు వెడల్పు చేయడంతో సీసీ కెమరాలు కనిపించకుండా పోయాయి. సకాలంలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఏ జిల్లా నుంచి ఏ ప్రాంతం నుంచి దేనికోసం వస్తున్నారో గుర్తించడం క్లిష్టంగా మారింది.

ఇంట్లో నుంచి బయటకు వెళ్లారా అంతే సంగతులు

వెంకటేశ్వరనగర్‌కు చెందిన మహమ్మద్ ఖలీల్ రఫీయా ఖాతున్ గస్టు 8వ తేదీన ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి వారు ఇంటికి చేరుకోని సరికి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు ధ్వంసం చేసి ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగలుకొట్టి 80 తులాల వెండి ఆభరణాలు, 3 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారు.

● ఆగస్టు 22న గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన మల్లోజు విష్ణుమూర్తి దేవరకొండలోని ఆర్టీసీ డిపోలో బస్సు మెకానిక్‌గా పనిచేస్తున్నారు. రోజూ మాదిరిగానే విధుల నిర్వహించడకోసం వెళ్లగా, భార్య ఇంటికి తాళాలు వేసుకొని కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇదే సమయంలో దొంగలు ఎవరూ లేరని తెలుసుకొని తాళాలు పగలకొట్టి 12 తులాల వెండి ఆభరణాలను దోచుకువెళ్లారు.

● ప్రముఖ విశ్రాంత అధ్యాపకుడు చేపూరి బ్రహ్మచారి జగదాంబ వారి ఆస్పత్రికి హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ నెల 8న ఎంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి వేళ్లలో దొంగలు ఇంట్లోకి చొరపడి 2 కిలోల వెండి ఆభరణాలు రూ. 5 వేల నగదును తీసుకెళ్లారని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తాం



వెంకటేశ్వరనగర్(మాల్)లో త్వరలో వ్యాపారస్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దొంగతనాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటాం. వెంకటేశ్వరనగర్‌లో పెట్రోలింగ్ ఏర్పాటుతో పాటు సీసీ కెమెరాల కోసం ప్రజలతో సమావేశం నిర్వహించి వారి సహకారంతో నిఘా వ్యవస్థ పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేముందు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. గుర్తుతెలియని వ్యక్తులు తిరిగితే 100కు సమాచారం ఇవ్వాలి.

● యాదయ్య ఎస్ఐ, చింతపల్లి

జడ్పీలో కారుణ్య భర్తీలేవీ?

● ఏడు సంవత్సరాలుగా భర్తీకాని 150పోస్టులు
● కౌన్సిలింగ్‌కు ముందుకు రాని బాధిత కుటుంబాల సభ్యులు
● అటెండర్ పోస్టులు కావడమే వెనుకంజకు కారణం
● జూనియర్ అసిస్టెంట్ పోస్టుల కోసం పట్టు

నల్లగొండ, సెప్టెంబరు 5: జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకాల పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతోంది. స్థానిక సంస్థల ఉద్యోగులు ఎవరైనా మరణించినా, ఆరోగ్య కారణాల రీత్యా ఉద్యోగం చేయలేని పరిస్థితుల్లో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నా సదరు ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాల్సి ఉంటుంది. ఈ విధానం అనేక సంవత్సరాలుగా కొనసాగుతోంది. నల్లగొండ జిల్లా పరిషత్ పరిధిలో వివిధ సెక్షన్‌లలో 150పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరేడు సంవత్సరాలుగా ఈ పోస్టులు భర్తీ కావడం లేదు. కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీరాజ్‌తో పాటు స్థానిక సంస్థల పరిధిలో ఎదైనా ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ మరణించిన, వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించడమే కారుణ్య నియామక లక్ష్యం. సదరు ఉద్యోగి మృతితో వారి కుటుంబాలు వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతుంటారు. జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు, ఇతర స్థానిక సంస్థల ఉద్యోగుల వారసులు కారుణ్య నియామకాల భర్తీ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగి సర్వీస్ కాలంలో మరణిస్తే ఆ వ్యక్తి కుటుంబంలో భార్య, భర్తకు, కుమారుడికి, కూతురికి లేదంటే కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు వారిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. వారి అర్హత ఆధారంగా మృతిచెందిన ఉద్యోగి తత్సమాన ర్యాంకు ప్రకారం అదేస్థాయిలో ఉద్యోగం లేదంటే తక్కువ స్థాయిలో ఉద్యోగం కల్పించాల్సి ఉంటుంది. ఇది ఉద్యోగుల హక్కుతో పాటు సర్వీస్ నిబంధనలో కూడా ఉంది.



అటెండర్ పోస్టులే కారుణ్య నియామకాలకు ఆటంకం

కారుణ్య నియామకాల భర్తీ నల్లగొండ జిల్లా పరిషత్‌లో కొనసాగుతున్నప్పటికినీ అవి అంతంతా మాత్రమే ఉంటున్నాయి. దీని ప్రధాన కారణం అటెండర్ పోస్టులు మాత్రమే 150పోస్టులు ఉండటం తప్ప ఉన్నత పోస్టులు లేకుండా పోయాయి. అటెండర్ పోస్టుల పట్ల(ఆఫీస్ సబార్డినేట్) మృతిచెందిన కుటుంబ సభ్యుల పిల్లలు లేదంటే ఇతర పెద్దలు విముకత చూపిస్తూ ముందుకు రావడం లేదు. మండల పరిషత్, ఇతర స్థానిక సంస్థల్లో సబార్డినేట్ ఉద్యోగాలు తప్ప మిగతా ఉద్యోగాల్లో నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నుంచి ఈ నియామకాలు అరకొరగా సాగుతున్నాయి. ఈ ఉద్యోగాలకు సంబంధించి అంటెండర్ పోస్టులోనే నియామక ప్రక్రియ చేపట్టడంతో డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్‌తో పాటు కాస్తా ఆర్థికంగా ఉన్న బాధిత కుటుంబాల పిల్లలు లేదంటే వారి కుటుంబ సభ్యులు అంటెండర్ పోస్టులు కాకుండా జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కోరుకోవడం మూలంగా జిల్లాలో నియామకాల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కోరుకుంటుండంతో కారుణ్య నియామకాల పోస్టులు భర్తీ కావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 58 ఏళ్ల నుంచి 61ఏళ్లకు పెంచడంతో గతంలో మాదిరిగా ఖాళీలు కూడా ఏర్పడటం లేదు. కారుణ్య నియామకాల్లో డిగ్రీ అర్హత ఉన్న వారికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, తెలుగు, ఇంగ్లీష్ హాయ్యర్ ఉత్తీర్ణత ఉన్నవారికి టైపిస్టు ఉద్యోగాలు, పదో తరగతి చదివిన వారికి ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం ఇస్తారు. జిల్లాలో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారిలో అత్యధికంగా ఉన్నత విద్యను అభ్యసించిన వారు ఉండటం వారు కోరుకున్న విధంగా పోస్టులు లేకపోవడం సమస్యగా మారింది. కొంతమంది డిగ్రీ పూర్తి చేసే దశలో పిల్లలు సైతం తమకు అటెండర్ బదులు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ పోస్టు కావాలంటూ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఆర్జీ పెట్టుకున్నారు.

పైస్థాయి కేటగిరి ఖాళీలపై దృష్టి సారించని ప్రభుత్వం

ప్రతి ప్రభుత్వ శాఖలోను అటెండర్ పోస్టులను మాత్రమే కారుణ్య నియామకాల కోసం ఖాళీలు చూపిస్తున్న ప్రభుత్వం సబార్డినేట్ పై స్థాయి ఖాళీలను మాత్రం ఖాళీలుగా చూపించకపోవడంతో జిల్లా పరిషత్ పరిధిలో పోస్టుల భర్తీకి తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా పరిషత్ అధికారులు ఈ ఆరేడు సంవత్సరాలుగా కారుణ్య నియామకాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇస్తూ కౌన్సిలింగ్‌కు ఆహ్వానిస్తున్నా వచ్చిన బాధిత కుటుంబ వారసుడు తమకు జూనియర్ అసిస్టెంట్ పోస్టు క్యాడర్ కలిగిన ఉద్యోగం ఇస్తేనే జాయిన్ అవుతామంటున్నారు. ఉన్నత చదువులు చదివి అటెండర్ పోస్టులో జాయిన్ అయితే పదోన్నతి వచ్చే వరకు ఏళ్ల సమయం పడుతుందని, సగం సర్వీస్ పూర్తి అవుతుందన్నా ఆలోచనతోనే అటెండర్ పోస్టులో బాధ్యతలు తీసుకోవడానికి వారసులు వెనకంజ వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కారుణ్య నియామకాల భర్తీ కోసం ఏ విధమైన ఆలోచన చేస్తుదనే దానిపై ఎదురు చూస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు ఇతర పై క్యాటగిరి పోస్టులను భర్తీ చేస్తారా లేదా అనేది చర్చసాగుతోంది. జిల్లా పరిషత్‌లో 2018 సంవత్సరం నుంచి కారుణ్య నియామకాలు పూర్తి స్థాయిలో జరగడం లేదు. జడ్పీ కార్యాల యంలో వివిధ హోదాలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగుల పిల్లలు, అటు కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి ఓ వైపు కోరుతునే మరోవైపు అటెండర్ పోస్టులకు బదులుగా ఉన్నత పోస్టులను కోరుతుండడంతో పెండింగ్ పడుతోంది.

కౌన్సిలింగ్‌కు పిలిచినా ముందుకు రావడం లేదు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల పోస్టుల భర్తీకి అనేక సార్లు నిర్ణయం తీసుకున్నాం. కౌన్సిలింగ్‌కు పిలిచిన కూడా ముందుకు రావడం లేదు. అటెండర్ పోస్టుల పట్ల వారు విముఖత చూపుతున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారు అటెండర్ పోస్టులల్లో జాయిన్ కావడం లేదు. దీంతోనే చాలా కాలంగా కారుణ్య నియామకాలు పూర్తి స్థాయిలో చేపట్ట లేకపోయాం. చనిపోయిన వారి వారసులు ఖాళీగా ఉన్న పోస్టుల్లో జాయిన్ కావడానికి ముందుకు వస్తే నియామకాలను వెంటనే చేపడతాం.

● ప్రేమ్‌కరణ్ రెడ్డి, జడ్పీ సీఈవో, నల్లగొండ

గుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 5: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిత్య కైంకర్యాలు గురువారం పాంచా రాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహిం చారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.14,10,624ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఎమ్మెల్సీ కోదండరాం సతీసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డు ప్రసాదం అందజేశారు.



ఆలయంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మేళ్లచెర్వు, సెప్టెంబరు 5: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల పరిధిలోని వేపలమాదారం గ్రామంలో 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వేపలమాదారం గ్రామానికి చెందిన నాగులమీరా ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఓ షెడ్డులో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 13 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నాగుల్‌మీరాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

సీజ్ చేసిన మద్యం బాటిళ్లు ధ్వంసం



సూర్యాపేటలో మద్యం బాటిళ్లు ధ్వంసం చేస్తున్న పోలీసులు

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 5: సూర్యాపేట పట్టణంలో కొంత కాలంగా వివిధ కేసుల్లో సీజ్ మద్యాన్ని గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. కొంత కాలంగా పట్టణంలో నమోదైన 72 కేసులకు సంబంధించిన రూ.2.5లక్షల విలువ చేసే వివిధ రకాల బ్రాండ్ల మద్యాన్ని నిర్వీర్యం చేశారు. కార్యక్రమంలో ఈఎస్ లక్ష్మానాయక్, పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్, ఎస్ఐలు లోకేష్‌కుమార్, బాల్నె కుశలవ సిబ్బంది పాల్గొన్నారు.

'పేట'లో రెండు కిలోల గంజాయి స్వాధీనం

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి సూర్యాపేటకు తరలించి విక్రయించేందుకు యత్నించిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను సూర్యాపేట డీఎస్పీ జి. రవి వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని అన్నాదురైనగర్‌కు చెందిన భోగ చరణ్, జేజేనగర్‌కు చెందిన అతని స్నేహితుడు చిలకరాజు సందీప్ కలిసి నాలుగు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు ప్రాంతంలో ఓ వ్యక్తి వద్ద రూ. 5వేలు చొప్పున రెండు కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి గంజాయి సూర్యాపేటకు తీసుకొచ్చారు. ఇతరులకు విక్రయించేందుకు పట్టణంలోని రాజీవ్‌పార్కు సమీపంలో వేచి ఉండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణ పోలీసులు దాడి చేసి గంజాయితో పాటు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్, పట్టణ ఎస్ఐ లోకేష్ కుమార్, సిబ్బంది గొర్ల క్రిష్ణయ్య, గోదేశి కర్ణాకర్, శ్రీరాములు, జోగు సైదులు, చీకూరి మధు ఉన్నారపాఌ



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

వాహనం ఢీకొని 11గొర్రెలు మృత్యువాత

పెద్దవూర, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని పోతునూరు స్టేజీ సమీపంలో జాతీయ రహదారి-167పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 11గొర్రెలు మృతిచెందాయి. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా ఇమాంపేటకు చెందిన నగిరే గంగరాజుతో మరో ఐదుగురికి చెందిన జీవాలు నల్లగొండ జిల్లా పెద్దవూర సమీపంలోని పలు గ్రామాల్లో మేతమేపుకొని పోతునూరు వైపు వెళ్తుండగా మల్లెపల్లి నుంచి పెద్దవూర వైపు వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా వస్తు గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 11గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మరికొన్ని గొర్రెలు గాయలపాలయ్యాయి. సుమారు రూ.2లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు రైతులు వాపోయారు. రైతుల ఫిర్యాదుపై దర్యాప్తు నమోదు చేఉసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు



గొర్రెల కలేబరాలు

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు



తిప్పర్తి, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని కేశరాజుపల్లి గ్రామంలో వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన ఓర్సు వెంకటయ్య రెండో సంతానం రూపాని అరుణ(28) భర్తకు దూరంగా ఉంటూ తనకు ఇద్దరు పిల్లలను హాస్టల్‌లో ఉంచి తిప్పర్తి మండలంలోని కేశరాజుపల్లి గ్రామంలో ఐదు నెలలుగా గదిని అద్దెకు తీసుకొని నివాసముంటుంది. గత నెల 29వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లిన అరుణ తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన తండ్రి వెతకగా అచూకీ లభించలేదు. తన కూమార్తె అదృశ్యంపై చిట్యాల మండలం తేనెపల్లి గ్రామానికి చెందిన రూపాని అనిల్‌పై అనుమానం ఉందని అరుణ తండ్రి ఓర్సు వెంకటయ్య గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 5: బైక్ దొంగతనం కేసులో చౌటుప్పల్ మెజిస్ట్రేట్ వైష్ణవి మహతి ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధించినట్లు సీఐ మన్మథరావు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా ఆత్మకూర్ మండలం రాఘవపురం గ్రామానికి చెందిన బద్దుల అనిల్, మోత్కూర్ మండలం శదర్శనపురం గ్రామానికి చెందిన బత్తిని స్వాతి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఆరు నెలల క్రితం బైక్‌ను చోరీ చేశారు. ఎస్ఐ యాదగిరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుకొని నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ ఖాజా నిజామోద్దీన్ కేసును వాదించారు.

వరకట్నం వేధింపుల కేసులో జైలు

చౌటుప్పల్ రూరల్ సెప్టెంబరు 5: అదనపు వరకట్నం వేధింపుల కేసులో జైలు శిక్ష పడి తప్పించుకు తిరుగుతున్న భర్తను పోలీసులు అరెస్టు చేసిన ల్లగొండ జైలుకు పంపించారు. సీఐ మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన కాశమోని గోపాల్(32) తంగడపల్లికి చెందిన మహిళను 2016లో వివాహం చేసుకున్నాడు. పెళ్లి సందర్భంగా తల్లితండ్రులు కట్నకానుకులు ఇచ్చారు. పెళ్లి తర్వాత భర్త గోపాల్ భార్యను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేశాడు. భార్య భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న అప్పటి ఎస్ఐ నాగరాజు దర్యాప్తు చేసి భర్తను కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడు భువనగిరి కోర్టుకు అప్పీల్‌కు వెళ్లాగా కింది కోర్టు తీర్పునే అమలు చేయాలని మెజిస్ట్రేట్ తీర్పునిచారు. అప్పటి నుంచి నిందితుడు తప్పించుకొని తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని నల్లగొండ జైలుకు తరలించారు.

పగలంతా రెక్కీ.. రాత్రి ఇళ్లలో దొంగతనాలు

కొండాపూర్, సెప్టెంబరు 5: పగలంతా రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను లక్ష్యం చేసుకుని రాత్రి వేళలో దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని సంగారెడ్డి జిల్లాలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొండాపూర్ సీఐ చంద్రయ్య గురువారం వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయల గూడెంకు చెందిన సన్నిధి ఆంజనేయులు(30) తాపీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. జల్సాలకు, తాగుడుకు బానిసై ఇళ్ల, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బుధవారం రాత్రి మల్కాపూర్ చౌరస్తాలో కొండాపూర్ పోలీసులు, సీసీఎస్ పోలీసులతో కలిసి వాహన తనీఖీలు చేస్తుండగా అనుమానంగా కన్పించిన ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారించారు. 30ఇళ్ల చోరీల్లో 39.4 తులాల బంగారు ఆభరణాలు, 188తులాల వెండి, రూ.9.50లక్షల నగదు, రెండు బైకులను అపహరించినట్లు వెల్లడించారు. మొబైల్ ఫోన్ వాడకుండా ఎటువంటి సామగ్రి తీసుకెళ్లకుండా ఒంటరిగా వెళ్లి ఇంటి ఆవరణలో ఉండే ఇనుపరాడ్లు, రాళ్లతో తాళాలను పగులగొట్టి అపహరించేవాడు. నిందితుడిపై మెదక్, సంగారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, వికారాబాద్ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడి నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న కొండాపూర్, సీసీఎస్ పోలీసులకు సీఐ రివార్డులు అందజేశారు.



రికవరీ చేసిన నగలను, నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

టెంకాయల విక్రయ వేలం రూ.60.60లక్షలు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే టెంకాయల విక్రయవేలం రూ.60.60 లక్షలకు పాడారు. ఏడాది కాలపరిమితికి గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేలంలో తొమ్మిది మంది వేలందారులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిక్కుళ్ల శ్రీనివాస్ రూ.606.0లక్షల అధికంగా పాడి కొబ్బరికాయల వేలం విక్రయ హక్కును దక్కించుకు న్నారు. రెండో వేలందారుడైన కల్లూరి శ్రీనివాస్ రూ.60.50లక్షలకు వేలం పాడినట్లు గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో సుధాకర్ మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి, చెర్వుగట్టు మాజీ ఛైర్మన్ నల్ల వెంకన్న పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

స్వల్ప వాగ్వాదం

గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో కొంత వాగ్వాదం జరిగింది. గ్రామ పంచాయతీకి కొబ్బరికాయల వేలం హక్కుదారులు చెల్లించాల్సిన బకాయిలపై దుమారం రేగింది. వేలం డబ్బుల విషయంలో అవినీతి జరుగుతుందంటూ గ్రామస్థులు కొందరు అధికారులను నిలదీశారు. ఆధారాలుంటే చూపించి మాట్లాడాలని అధికారులు ఇచ్చిన సమాధానంతో కొందరు ఆగ్రహం చెందారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.

సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 587.70 అడుగులు



నిండుకుండలా ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 5: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు(312.0450టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 587.80 అడుగులుగా(305.9818టీఎంసీలుగా) ఉంది సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 96,399 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885అడుగులు(215.8070టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 884.80 అడుగులుగా (213.8878టీఎంసీలుగా) ఉంది. శ్రీశైలం ఒక క్రస్ట్ గేటును 10అడుగుల మేరకు ఎత్తి 27,937 క్యూసెక్కుల నీటిని, శ్రీశైలం కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 30,708 క్యూసెక్కుల నీటిని, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 95,761 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 587.80 అడుగులు (305.9818టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8529 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,476 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, వరద కాలువ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 40,405 నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 95,761 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

నిలకడగా పులిచింతల వరద

మేళ్లచెర్వు: పులిచింతలకు ఎగువ నుంచి స్వల్పంగా 57,428 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం 6,41,250 క్యూసెక్కులుగా నమోదైన వరద నీరు సోమవారం సాయంత్రానికి 5,48,050 క్యూసెక్కులుగా నమోదు కాగా మంగళవారం సాయంత్రానికి 4,07,855 క్యూసెక్కులుగా నమోదైంది. మంగళవారం రాత్రి 11 గంటలకు ఒక్కసారిగా లక్ష క్యూసెక్కులకు తగ్గిన వరద బుధవారం సాయంత్రానికి 20వేల క్యూసెక్కులుగా నమోదైంది. గురువారం 50వేల క్యూసెక్కులు నమోదు కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు. (45.77) టీఎంసీలు కాగా, 173.78అడుగులు. (43.88 టీఎంసీలుగా) నమోదు కాగా తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104 మెగావాట్లను విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా ప్రాజెక్టు మొత్తం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 57,482 క్యూసెక్కులుగా నమోదైంది.

ఏడు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి: నల్లగొండ, సూర్యాపేట జిల్లాల సరిహద్దుల్లో గల మూసీ ప్రాజెక్టుకు ఐదు రోజులుగా వరద కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఆలేరు, బిక్కేరులతో పాటు చిన్నాచితక వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో వరద నీరు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో మూసీ ప్రాజెక్టుకు వరద నీటిరాకడ భారీగానే ఉంటుంది. ఐదు రోజుల నుంచి ప్రాజెక్టుకు పెరిగిన వరద తాకిడి గురువారం సైతం కొనసాగింది. మంగళ, బుధవారాల్లో ప్రాజెక్టు ఏడు క్రస్టుగేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి ఎగువ నుంచి వస్తున్న వరదకు మించి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు గురువారం రెండు గేట్లు తగ్గించి ఐదు గేట్లను ఎత్తి 12,111క్యూసెక్కుల వరద నీటిని విడుదుల చేస్తున్నారు. మరోవైపు 641అడుగులకు పడిపోయిన ప్రాజెక్టు నీటిమట్టాన్ని గరిష్ట స్థాయికి చేర్చే చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో 8,773క్యూసెక్కులుగా నమోదైంది. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645అడుగులుకాగా గురువారం సాయంత్రానికి నీటిమట్టం 641.30అడుగులుగా నమోదైంది. రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 4.46టీఎంసీలకుగాను ప్రస్తుతం 3.52టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తి భారీగా నీటిని వదులుతున్నారు.



కోదాడలో మాట్లాడుతున్న ఎంఈవో సలీంషరీఫ్


తిరుమలగిరి మండలంలోని జలాల్‌పురం ఉన్నత పాఠశాలలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు



మునగాలలోని ప్రజ్ఞా హైస్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల చైర్మన్ కృష్ణమూర్తి


తిరుమలగిరి: తొండ గ్రామంలో ఉపాధ్యాయులను సన్మానించిన గ్రామాభ్యుదయ కమిటీ సభ్యులు

విద్యార్థులను తీర్చిదిద్దేది గురువులే

విద్యార్థులను తీర్చిదిద్దేది గురువులేనని పలువురు వక్తలు అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా వ్యాప్తంగా గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులు, పాఠశాల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్


నేరేడుచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు


హుజూర్‌నగర్‌లోని అయ్యప్ప దేవాలయంలో ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న అన్నమయ్య భక్త బృందం


గరిడేపల్లి: పొనుగోడు జడ్పీ ప్రాథమిక పాఠశాలలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు


తిరుమలగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


సూర్యాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2లో గురుపూజోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురుపూజోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు

గురుకుల పాఠశాలకు నిలిచిన విద్యుత్ సరఫరా

● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు


కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటికి వెళుతున్న గురుకుల విద్యార్థులు

కోదాడ రూరల్, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని దోరకుంట గ్రామంలోని పులిచింతల పునరావాస కేంద్రంలో బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా లేనందున గురుకులంలో పాఠశాలలోని ప్యూరిఫైడ్ ప్లాంట్ మూలన పడింది. స్నానం చేయడానికి కూడా నీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థులు బయటికి వెళ్లాల్సివస్తోంది. గురుకులంలో విద్యుత్‌ను పునరుద్ధరించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

బోనాలు తెలంగాణ సంస్కృతికి చిహ్నాలు

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 5: బోనాలు తెలంగాణ సంస్కృతికి చిహ్నాలని కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని పాత ఎస్పీ కార్యాలయం ఎదుట వన ముత్యాలమ్మ అమ్మవారికి బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో గోవింద్, కృష్ణ పాల్గొన్నారు.

జీవాల పెంపకదారులు జాగ్రత్త వహించాలి

కోదాడ రూరల్, సెప్టెంబరు 5: జీవాలు విషపూరిత మొక్కలు తిని ప్రాణాలు కోల్పోకుండా పెంపకందారులు జాగ్రత్త వహించాలని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య సూచించారు. విషపూరిత మొక్కలు తిని అస్వస్థతకు గురైన గొర్రెలకు గురువారం పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాల లో చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించాలి

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 5: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలని సీఐ చరమందరాజు అన్నారు. గురువారం పట్టణంలోని ఎండీఆర్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మెరిట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి మట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దామోదర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి,పాల్గొన్నారు.

భూమి ఆక్రమణ ఫిర్యాదుపై విచారణ

పెన్‌పహాడ్, సెప్టెంబరు 5: భూమి ఆక్రమణ ఫిర్యాదుపై పెన్‌పహాడ్ ఆర్ఐ ఎండీ హజీజా గురువారం విచారణ జరిపారు. పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామంలో సర్వే నెం. 350, 341లో ఉన్న వ్యవసాయ భూమిని, ఎస్సారెస్పీ కాల్వ పరిధిలోని భూమిని లింగాల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని లింగాల గ్రామానికి చెందిన మహిళా రైతు గార్లపాటి స్వర్ణ జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారులు ఆదేశం మేరకు ఆ సర్వే నెంబర్లలో భూమిని ఆర్ఐ ఎండీ హజీజా సర్వే చేశారు. ఈ విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆర్ఐ తెలిపారు.

సీపీఎం నాయకుడు వెంకయ్య మృతి

పెన్‌పహాడ్, సెప్టెంబరు 5: మండలంలోని చీదెళ్ల గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు మర్రిపెల్లి వెంకయ్య(80) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు భార్య తిరుపతమ్మతో పాటు ఐదుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గురువారం జరిగిన వెంకయ్య అంత్యక్రియల్లో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ వెంకయ్య, ఆయన కుటుంబ సభ్యులు సీపీఎం సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. వెంకన్న అంత్యక్రియల్లో అంజిబాబుగౌడ్, ెంకటేశ్వర్‌రావు, సైదులు పాల్గొన్నారు.

చెరువు తూము ధ్వంసం

చిలుకూరు, సెప్టెంబరు 5: మండలంలోని బేతవోలు గ్రామంలోని కోమటికుంట చెరువు తూమును గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. తమ భూములు మునగకుండా చెరువు భూమి ఆక్రమణదారులే తూమును ధ్వంసం చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. . తూమును ధ్వంసం చేయడంతో చెరువులో నీరు వృథాగా పోతుందని, నిందితులను ఐబీ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోడంతో పాటు తూముకు మరమ్మతులు చేయించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

CLASSIFIEDS

ఒరిజినల్ సర్టిఫికెట్స్ పోయినవి

★ ఇరుగు కృష్ణ, తండ్రి: చంద్రయ్య, జె.జె.నగర్, సూర్యాపేటకు సంబంధించిన D.Ed.(Diploma In Education) ఒరిజినల్ పర్సనల్ సర్టిఫికెట్స్ తేది: 20.07.2024 నాడు కొత్త బస్టాండ్ నుండి జె.జె.నగర్ బైక్‌పై వెళ్తుండగా పోయినవి. దొరికిన వారు సంప్ర॥ సెల్ : 9030111232

AJY_161931

CHANGE OF SURNAME

★ I SAYYAD MOQTHADIR AHMED H.No. 3-4-63, PSR Centre,Suryapet submit that My Surname SYED(old) Changed to SAYYAD(new) and my Father Surname Changed SYED to SAYYAD. And my H.No.also changed 3-4-63/1,Aqusamazeed (old) To 3-4-63,Chinna Masjid (New). Henceforth I shall be called As SAYYAD MOQTHADIR AHMED for all purpose

AJY_6724

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/- Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413656 9985413365

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9177572576

మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి


మట్టి విగ్రహాన్ని పంపిణీ చేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 5: వినాయక చవితి నవరాత్రి వేడుకల్లో భాగంగా పట్టణ ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలోని మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేసి మాట్లాడారు. రసాయనాలు వినియోగించి రూపొందించిన వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేస్తే చెరువు నీరు కలుషితమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, వైస్ చైర్మన్ పు కిశోర్, కౌన్సిలర్ షఫీవుల్లా, వెలుగు వెంకన్న, బైరు శైలేందర్‌గౌడ్, నాయకులు ఆకుల లవకుశ, జ్యోతి కర్నాకర్, సుంకరి రమేష్, మునిసిపల్ ఈఈ కిరణ్, ఆర్వో కల్యాణి, మాధవి, గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి: వెంకన్నయాదవ్

మద్దిరాల, సెప్టెంబరు 5: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. గురువారం మద్దిరాల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి నూతనంగా ఇళ్లు నిర్మిస్తామన్నారు. రూ.2లక్షలకు పైగా పంట రుణాలు ఉన్న రైతులందరికీ ప్రభుత్వం త్వరలోనే మాఫీ చేస్తుందన్నారు. అపోహలను రైతులు నమ్మొద్దన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నెపర్తి జ్ఞానసుందర్, పచ్చిపాల వెంకన్న, వల్లపు రమేష్, అమృతమల్లు, తాళ్లపల్లి సురేష్, నలమాస ఉపేందర్, శ్యాంరెడ్డి, కొమ్ము అంజయ్య, కంట్లం, మాన్‌సింగ్, అవిలయ్య పాల్గొన్నారు.


అవిలమల్లుయాదవ్‌ను సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్

మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయం


మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బిషప్ దుర్గం ప్రభాకర్

కోదాడ టౌన్, సెప్టెంబరు 5: మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయం అని పలువురు నాయకులు అన్నారు. మదర్ థెరిస్సా 27వ వర్ధంతి సందర్భంగా కోదాడలోని మునిసిపాలిటీ ప్రాంగణంలో ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి కోదాడ నియోజకవర్గం యునైటెడ్ పాస్టర్స్ అసోసియేసన్ అధ్యక్షుడు వి.యేషయా ఆధ్వర్యంలో కోదాడ మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, క్రిస్టియన్ కోఆప్షన్ మెంబర్ వంటిపాక జానకి యేసయ్య, ఆలిండియా, ఫెడరేషన్ ఆఫ్ మదర్ థెరిస్సా సోషల్ ఆర్గనైజేషన్ నల్గొండ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదర్ థెరిస్సా బీదలకు చేసిన సేవలు ప్రపంచానికే ఆదర్శమన్నారు. మదర్ థెరిస్సా చేసిన మానవ సేవకు 1979లో నోబెల్ శాంతి పురస్కారం, 1980లో భారతరత్న అవార్డులు వరించాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డేవిడ్‌రాజు, సుందర్‌రావు, రాజేష్, సీహెచ్ లూకా ప్రభుదాస్, రాజారావు, పాండు, దేవసహాయం, దయాకర్, రేవ రజనీకాంత్, ఏలియా రాజు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

'కులగణన తర్వాతే రిజర్వేషన్లు అమలు చేయాలి'

హుజూర్‌నగర్, సెప్టెంబరు 5: ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల గణన చేపట్టిన తర్వాతే ఎస్సీ రిజర్వేషన్లు అమలుచేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమళ్ల హుస్సేన్ కోరారు. గురువారం పట్టణంలోని రహదారి బంగ్లాలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీలు 25శాతం ఉన్నారన్నారు. బీసీలకు కూడా రిజర్వేషన్లు అమలుచేయాలన్నారు. 2024జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దేశంలోని అనేక రాష్ట్రాల్లో పలు కులాల వారు ఆందోళనగా ఉన్నారన్నారు. కుల గణనను ప్రభుత్వాలు వెంటనే చేయాలన్నారు. వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లతోనే న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇట్టిమళ్ల బెంజిమెన్,ఇట్టిమళ్ల శ్రీనివాస్, రామకృష్ణ, విమన్, వీరస్వామి, బాబూరావు, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, రాములు పాల్గొన్నారు.

సీపీఐ నాయకురాలు పద్మ మృతి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 5: పట్టణానికి చెందిన సీపీఐ నాయకురాలు దిగదారి పద్మ(70) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందింది. పద్మ మృతదేహానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీను, నరేందర్, రాంప్రసాద్, రామకృష్ణ, రామనాథం, శ్రీనివాసాచారి, వెంకటరెడ్డి పాల్గొని సంతాపం తెలిపారు.

నేడు కోదాడకు బండి సంజయ్ రాక

కోదాడ, కోదాడ టౌన్, సెప్టెంబరు 5: వరద బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు కేంద్రం హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలు శుక్రవారం కోదాడకు వస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ, కోదాడ పట్టణ అధ్యక్షుడు సాతులూరి హనుమంతరావు తెలిపారు. గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోదాడ పట్టణంతో పాటు మండలంలోని తొగర్రాయి, కూచిపూడి గ్రామాలు దెబ్బతినటంతో పాటు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందన్నారు. . ఈ నేపథ్యంలో తొగర్రాయి గ్రామంలోని వరద బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు బండి సంజయ్ వస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలి

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 5: వర్షాలతో గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతు చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని సూర్యాపేట-దంతాలపల్లి రోడ్డుపై ధర్నా నిర్వహించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్ నుంచి కుడకుడ వరకు మునిసిపాలిటీ పరిధిలో ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వసమైందన్నారు. కోమటికుంటకు చెందిన ఓ వ్యక్తి గుంతలో పడటంతో తీవ్రగాయాలయ్యాయని తెలి పారు.ఈ కార్యక్రమంలో కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య,సయ్యద్, చంద్రకళ, పద్మ, కల్పన, రేణుక, సురేష్ పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

సూర్యాపేట: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌ను హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సమ్మ కోరారు. పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో గురువారం ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మల పెన్‌పహాడ్‌లో కొవ్వొత్తు లతో నిరసన తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు నాగమ్మ, జీవిత, లింగమ్మ, సైదమ్మ, లక్ష్మి, సైదాబి, మంగమ్మ పాల్గొన్నారు.

ఆకతాయిలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

సూర్యాపేట రూరల్: ఆకతాయిల వేధింపులపై విద్యార్థినులు, మహిళలు నిర్భయంగా షీటీంకు ఫిర్యాదు చేయాలని షీటీం ఎస్ఐ నీలిమ అన్నారు. గురువారం మండలంలోనిచందన నర్సింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగహన కల్పించి మాట్లాడారు. మహిళలు ఆపద సమయంలో డయల్ 100, జిల్లా షీటీం సెల్ నెం.8712686056 లేదా క్యూర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సాలయ్య, యల్లారెడ్డి, గుండా రమేష్ పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

చివ్వెంల: అన్నదానం మహాదానమని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్ అన్నారు. తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం పుట్టినరోజు సందర్భంగా గురువారం మండలంలోని శ్రీఅన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, బొడ్డు శంకర్, చంద్రకాంత్, గోపి, వినయ్‌గౌడ్, మంగునాయక్ లోకేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ

హుజూర్‌నగర్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ రాజేష్, సూపర్‌వైజర్ సోమమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో రజని, సుజాత, నిర్మల, ఉమ పాల్గొన్నారు.

ఉప పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉంచాలి

చిలుకూరు: మండలంలోని బేతవోలు గ్రామంలోని ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ మందులు అందుబాటులో లేవని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కినపల్లి జానకిరామాచారి అన్నారు. గురువారం బేతవోలు ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో బోదకాలు, ఇతర సీజనల్ మందులు లేవన్నారు. ఈ నిరసన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాస్, ప్రసాద్, లింగయ్య శ్రీను పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నూతనకల్: మండలంలోని వెంకేపల్లి గ్రామానికి చెందిన దూదిగామ మధు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మధుతో పాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితులు ఆయన కుటుంబానికి గురువారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మధు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లింగాచారి, పరుశరాములు, శ్రీనివాస్, శిరీష, వెంకన్న, ఉమ, లింగయ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

తిరుమలగిరి: పంచాయతీ ఎన్నికలు పురస్కరించుకుని మండలంలోని 16గ్రామ పంచాయతీలకు చెందిన ఓటరు జాబితాను తిరుమలగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లాజర్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఓటరు జాబితాను ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతీమన్నారు. ఓటర్లు, రాజకీయ పార్టీలు జాబితాను పరిశీలించి, సవరణలు ఉంటే తెలియజేయాలన్నారు. . మండలంలో మొత్తం ఓటర్లు 17,575మంది ఉన్నారన్నారు.

ఇసుక మేటలు తొలగించాలి

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 5: వరదలతో పంట పొలాల్లో వేసిన ఇసుక మేటలను ప్రభుత్వం తొలగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, శీలం శ్రీను, పోసనబోయిన హుస్సేన్ కోరారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాల్లో వేసిన ఇసుక మేటలను పరిశీలించి మాట్లాడారు. మండలంలో వేయి ఎకరాలలో రైతులు పంట నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మురళి, భిక్షం, వెంకటనారాయణ, పర్వతాలు, వెంకటి, వెంకన్న పాల్గొన్నారు.

గోవిందాపురం రోడ్డులో గండిని పూడ్చాలి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 5: హుజూర్‌నగర్ నుంచి గోవిందాపురం వెళ్లే రోడ్డులో గండిని పూడ్చాలని కాంగ్రెస్ నాయకుడు, వార్డు మాజీ మెంబర్ కంకణాల పుల్లయ్య మునిసిపల్ కమిషనర్ యాకుబ్‌ను కోరారు. గురువారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ గోవిందాపురానికి వెళ్లే రోడ్డులోని గంగమ్మ దేవాలయం వద్ద గండిని గూనలు వేసి పూడ్చి రాకపోకలను పునరుద్ధరించాలన్నారు. గోవిందాపురం వాసులు హుజూర్‌నగర్‌కు రావాలంటే ఐదు కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాము, వెంకన్న, వెంకటేశ్, శ్రీను, రాంబాబు, సైదులు, రామకృష్ణ, వేణు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 5: వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దుగ్గి బ్రహ్మం కోరారు. గురువారం పట్టణంలోని కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. హుజూర్‌నగర్‌లోనే ఆరు వేల ఎకరాలలో పంట నష్టం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, వీరబాబు, వీరస్వామి, వీరారెడ్డి, పురుషోత్తంరెడ్డి, మాధవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.

నూతనకల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకే ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దింటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రవణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వందల ఎకరాలల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. మాచినపల్లి గ్రామంలో పశువులు పాలేరు వాగులో మునిగి చనిపోయాయని, బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, దినేష్, అవిలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

కోదాడ రూరల్: తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణ సాయం అందించి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్యం పాపిరెడ్డి అన్నారు. భారీ వర్షాలకు ఽమండలంలోని రామలక్ష్మీపురం, ఎర్రవరం గ్రామాల్లో దెబ్బతిన్న పొలాలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పంటనష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. కౌలు రైతులు కూడా నష్టపోయారని, ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా నివేదిక తెప్పించుకుని కౌలు రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కమలమ్మ, గోవిందు, రాజశేఖర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలి

తిరుమలగిరి, సెప్టెంబరు 5: తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని మూడో వార్డు సుందరయ్యకాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరుతూ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) ఆధ్వర్యంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములుకు గురువారం వినతిపత్రం అందజేశారు. వర్షాలు పడుతున్నందున రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు ఉండి, కాలనీలోకి నడిచివెళ్లడానికి కూడా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడెం లింగయ్య, లక్ష్మి, యాదయ్య, నాగేష్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలు సేకరిస్తున్నాం: ఏవో

చిలుకూరు, సెప్టెంబరు 5: భారీ వర్షాలకు మండంలో నష్టం వాటిల్లిన పంటల వివరాలు సేకరిస్తున్నామని ఏవో శ్రీధర్ తెలిపారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పొలాలను గురువారం మండలంలోని నారాయణపురం గ్రామంలో పరిశీలించి పంట వివరాలు నమోదు చేసి మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతులకు ఒక్కరోజు ముందుగా తెలియజేసి పంటనష్ట వివరాలు సేకరించేందుకు తామే గ్రామాలకు వస్తామన్నారు. ఆయన వెంట ఏఈవో చంద్రశేఖర్, శిరీష ఉన్నారు.

త్వరగా రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేయాలి

వరదలకు చిలుకూరు మండలంలోని నారాయణపురం, సీతారాంపురం, చిలుకూరు గ్రామాల చెరువులు తెగడంతో తొగర్రాయి గ్రామ శివారులోని వంతెన కొట్టుకుపోయింది. దీంతో గ్రామం చుట్టూ ఇసుక మేటలు, నీరుఉన్నందున ఆ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. రెండు రోజుల క్రితం రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారని, త్వరగా పూర్తిచేసి ప్రజల రాకపోకలను పునరుద్ధరించాలని కోరారు.

కేశవాపురంలో వైద్య శిబిరం

తుంగతుర్తి, సెప్టెంబరు 5: భారీ వర్షాలకు మండంలోని బంధం వాగు నీటి ఉధృతికి కేవవాపురం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆ గ్రామస్థులు వైద్యం కోసం ఇబ్బంది పడుతున్నందున మెడికల్ ఆఫీసర్ లింగమూర్తి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ట్రాక్టర్‌పై కేశావాపురం చేరుకుని గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి జ్వరాలతో బాధపడుతున్నవారికి మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ గాజుల సోమన్న, ఏఎన్ఎంలు రజిత, నాగలక్ష్మి, రమ, అంగన్‌వాడీ టీచర్ సంగీత, ఆశ కార్యకర్త మేరమ్మ, గ్రామ సిబ్బంది అవిలయ్య, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లో చేరికలు'

సూర్యాపేట రూరల్, సెప్టెంబరు 5: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసూ వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోతి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కేటీఅన్నారం గ్రామానికి చెందిన కొణతం శ్రీనివాస్‌రెడ్డితో పాటు 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారిని పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తమ్‌రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కూరెల్లి శరభాచారి, కొడిదల ప్రతాప్‌రెడ్డి, ఎంపీఎల్, జంగం హుస్సేన్, వీరారెడ్డి, సతీష్, సంజీవ, పుణేష్ పాల్గొన్నారు.